హిందూపురంలో ఆర్టీసీ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

# బడి బస్సులు నడపాలి

## ఆర్టీసీ డిఎం కార్యాలయం ముందు ఎస్ఎఫ్ఐ ధర్నా

**ప్రజాశక్తి-హిందూపురం**

పాఠశాలలు, కళాశాలల వేళలకు అనుగుణంగా ఆర్టీసీ బడి బస్సులు నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిఎం కార్యాలయం ముందు ఆందోళన చేసి, అనంతరం ఆర్టీసీ అధికారి హంపన్నకు వినతి పత్రం ఇచ్చారు. బాబావలి మాట్లాడుతూ పట్టణంలో ఉన్న వివిధ కళాశాలలకు లేపాక్షి, చిలమత్తూరు, కొడికొండ, మడకశిర, సోమందేపల్లి, పెనుకొండ, పరిగి, కలిపి, రొద్దం, తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థులు ప్రతి రోజూ వస్తారన్నారు. నిబంధనల మేరకు ఆర్టీసీ అధికారులు విద్యార్థులకు బస్ పాసులు మంజూరు చేశారని, అయితే విద్యాసంస్థల వేళలకు అనుగుణంగా బస్సులను నడపడం లేదన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారని, కావున బడి బస్సులను తిరిగి పునః ప్రారంభించాలని, లేనిచో విద్యార్థులతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ నాయకులు జయచంద్ర, తరుణ్, మోమిన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# అమాత్యుల శాఖల్లో..

# అనంతకు ప్రాధాన్యత

పయ్యావుల కేశవ్
ఆర్థిక, ప్రణాళిక వాణిజ్య పన్నుల శాఖలు

సత్యకుమార్ యాదవ్
ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖలు

ఎస్.సవితమ్మ
బిసి సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత శాఖలు

- మూడూ ముఖ్యమైన పదవులే
- పయ్యావుల కేశవ్‌కు ఫైనాన్స్..
- సత్యకుమార్‌కు వైద్య ఆరోగ్యం
- సవితమ్మకు బిసి సంక్షేమం

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

రాష్ట్ర మంత్రి వర్గంలో మంత్రులకు శాఖల కేటాయింపులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు ప్రాధాన్యత దక్కింది. ఇప్పటి వరకు దక్కని అత్యంత ప్రాధాన్యమైన మంత్రి పదవులు ఈసారి జిల్లాకు దక్కాయి. ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు ఆర్థిక శాఖను కేటాయించారు. ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్‌కు విద్యా, వైద్య శాఖ, పెనుకొండ ఎమ్మెల్యే సవితమ్మకు బిసి సంక్షేమ శాఖను కేటాయించారు. ఉమ్మడి జిల్లాకు ఇంతటి ప్రాధాన్యమైన పోర్టుపొలియోలు దక్కడం ఇదే ప్రథమమని చెప్పవచ్చు.

**పయ్యావుల కేశవ్‌కు ఆర్థిక శాఖ**

ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ 1994 నుంచి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటికీ మొదటిసారి తప్ప తక్కిన అన్నిసార్లు ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందిన సమయాల్లో ప్రభుత్వం అధికారంలో లేదు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందిన సమయంలో శాసనసభలో తనదైన వాణిని గట్టి వినిపించి ప్రభుత్వాలను ఇరుకునపెట్టేవారు. మంచి వాగ్ధాటి కలిగిన ఆయనకు మంత్రివర్గంలో చోటు తొలిసారిగా లభించింది. అది కూడా ఆర్థిక శాఖ లభించడం గమనార్హం. 2019 నుంచి ఆయన పిఎసి ఛైర్మన్‌గా (ప్రజాపద్దుల కమిటీ)కి వ్యవహరించారు. ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వంలోని ఆర్థిక క్రమశిక్షణ లోపాలను ఎత్తిచూపారు. ఈ అనుభవం ఇప్పుడు ఆయన ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేయడానికి ఎంతగానో దోహదపడనుంది. ఏదిఏమైనా ఆర్థికశాఖ మంత్రిగా జిల్లాకు తొలిసారిగానే ఈపదవి దక్కిందని చెప్పవచ్చు. ఈయన జిల్లా అభివృద్ధి ఏ మేరకు దోహదపడగలరో చూడాల్సి ఉంది.

**సత్యకుమార్‌కు వైద్యశాఖ**

కూటమిలో భాగంగా బిజెపి తరుపున ఎమ్మెల్యే టిక్కెట్టు దక్కించుకుని ధర్మవరం నుంచి గెలుపొందిన సత్యకుమార్ తొలిసారిగా ఎమ్మెల్యే అయ్యారు. అంతేకాకుండా మంత్రివర్గంలోనూ చోటు దక్కించుకున్నారు. ఆయనకు విద్యా, వైద్యశాఖను కేటాయించారు. ఇది కూడా అత్యంత ప్రాధాన్యతమైన పదవే కావడం గమనార్హం. ప్రజారోగ్యా పరిరక్షణకు ఆయన ఏ మేరకు కృషి చేయగలరన్నది చూడాల్సి ఉంది.

**సవితమ్మకు బిసంక్షేమం,చేనేత**

పెనుకొండ నుంచి గెలుపొందిన సవితమ్మ బిసి సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడి వర్గాలు, చేనేత జౌళి శాఖ మంత్రిగా నియమితులయ్యారు. ఈమె కూడా తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందడమే కాకుండా బిసి సంక్షేమం, చేనేత శాఖ దక్కింది. ఈ జిల్లాలో బిసిలు, చేనేతలు అధికంగానున్నారు. వీరికి అనేక సమస్యలున్నాయి. వీటికి ఏ మేరకు పరిష్కారం చూపగలరో చూడాల్సి ఉంది. ఈమె కూడా రాజకీయ నేపథ్యమున్న కుటుంబం నుంచే వచ్చారు. తండ్రి రామచంద్రారెడ్డి మంత్రిగానూ, పార్లమెంటు సభ్యులుగానూ పనిచేశారు. దీంతో రాజకీయపరమైన అంశాలపై స్పష్టత ఉంది. పైమూడు పదవులు అత్యంత ప్రాధాన్యమైనవి కావడంతో జిల్లా అభివృద్ధికి ఏ మేరకు దోహదపడగలన్నది చూడాల్సి ఉంది.

మంగళగిరిలో మంత్రి సవితమ్మకు శుభాకాంక్షలు తెలుపుతున్న వికలాంగులు

## మంత్రి సవితమ్మకు శుభాకాంక్షలు

**ప్రజాశక్తి-సోమందేపల్లి**

మంగళగిరిలోని టిడిపి జాతీయ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, చేనేత, టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి సవితమ్మని వికలాంగులు కలిశారు. సిఎం చంద్రబాబు పింఛను పెంపు ఫైలుపై సంతకం చేయడంతో వికలాంగులు హర్షం వ్యక్తం చేశారు. సవితమ్మ వికలాంగులకు స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సవితమ్మ భర్త వెంకటేశ్వరరావు, నాయకులు శ్రీనివాసులు, చంద్ర, నిమ్మల శ్రీధర్, బాబుల్‌రెడ్డి, అరుణ్‌రెడ్డి, త్రివేంద్ర, మంజు పాల్గొన్నారు.

## 'ఎడారీకరణ నివారణ ఎలా' .?
## 17న ఎఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో సదస్సు

**ప్రజాశక్తి-అనంతపురం**

అనంతపురం కరువులు-ఎడారీకరణ నివారణ అన్న అంశంపై ఈనెల 17వ తేదీన సదస్సు నిర్వహించనున్నట్టు ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవి.మల్లారెడ్డి తెలిపారు. అనంతపురం నగరంలోని స్థానిక ఎఎఫ్ ఎకాలజీ కేంద్రంలో శుక్రవారం ఉదయం జరిగిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. జూన్ 17వ తేదీన ప్రపంచ కరువులు-ఎడారీకరణ నివారణ దినోత్సవం ఏటా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రకృతిలో వస్తున్న మార్పులతో ఏటా దేశ భూభాగం యాభై శాతం వరకు కరువులకు గురవుతున్నాయన్నారు. దేశంలో చూసినప్పుడు అనంతపురం జిల్లా నిత్యం కరువులకు నిలయమన్నారు. వరుస కరువులతో ఇక్కడ వ్యవసాయం దుర్లభమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రానురాను సాగుభూమి తగ్గుతుపోతోందని చెప్పారు. ఇది ఆందోళనకరమై అంశమని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కరువు నివారణపై దృష్టి సారించాల్సిన అవసరముందన్నారు. ఇప్పుడు కరువు నివారణ చర్యలుంటున్నా ఒక సమగ్రమైన ప్రణాళికతో లేవని చెప్పారు. రాబోయే రోజుల్లోనైనా ప్రభుత్వాలు శాశ్వత కరువు నివారణకు దీర్ఘకాలికమైన ప్రణాళికలు తీసుకొచ్చి చర్యలు చేపట్టాల్సిన అవసరముందని వివరించారు. ఇటువంటి అంశాలను ఈ ప్రపంచ కరువు నివారణ దినోత్సవం సందర్భంగా చర్చకు వచ్చేందుకు వీలుగా తాము ఈ సదస్సును ఈనెల 17వ తేదీన నిర్వహించాలని తలపెట్టినట్టు చెప్పారు. అనంతపురం నగరంలోని పంగల్‌రోడ్డు సమీపంలోనున్న ఆర్డీటీ సమ్మిళిత పాఠశాలలో ఈ సదస్సు నిర్వహించాలని తలపెట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి క్రీడా రిటైర్డు డైరెక్టర్ బండి వెంకటేశ్వర్లు ప్రధానోపనాస్యకులుగా హాజరవుతారని తెలిపారు. ఈయనతోపాటు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌తోపాటు పలువురు ప్రముఖులు, రైతులు హాజరుకానున్నట్టు వివరించారు. కావున ఈ కార్యక్రమానికి అందరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఎఫ్ ఎకాలజీ చీఫ్ ఆఫ్ ఆపరేషన్సు జె.మురళీకృష్ణ, కమ్యూనికేషన్ బాధ్యులు సుసర్ల రమేష్‌లు పాల్గొన్నారు.

రొద్దంలో 'మన అంగన్వాడీ పిలుస్తోంది' ర్యాలీ చేపట్టిన అంగన్వాడీ సిబ్బంది

## గ్రామాల్లో 'అంగన్వాడీ పిలుస్తోంది'

**లేపాక్షి :** మండలంలోని కంచిసముద్రం, లేపాక్షి, చోళసముద్రం గ్రామాల్లో శుక్రవారం 'మన అంగన్వాడీ పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా అంగన్వాడీ సెంటర్ల ముఖ్య ఉద్దేశం మూడేళ్లు పూర్తయిన పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని తల్లులకు తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మీ, మంజుల, అంగన్వాడీ కార్యకర్తలు ధనమ్మ, రూప, శశికళ, పార్వతి, భాగ్యమ్మ, సుధమ్మ, సుజాత, గాయిత్రీ, తదితరులు పాల్గొన్నారు.

**రొద్దం :** మండలంలోని కంబాలపల్లి గ్రామ-1, మినీ అంగన్వాడీ కేంద్రాల్లో 'మన అంగన్వాడీ పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుజాతమ్మ, అనురాధ ఆధ్వర్యంలో మండలంలోని దొడగట్ట, రెడ్డిపల్లి, వైటి.రెడ్డిపల్లి గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు తప్పకుండా పంపాలన్నారు. పిల్లలకు పాఠ్యపుస్తకాలు, నాణ్యమైన విద్య, మెనూ ప్రకారం భోజనం, పాలు, గుడ్డు అందిస్తారన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని పిల్లల భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జి.ఉమ, సి.ఉమ, ఆయా ముత్యాలమ్మ పాల్గొన్నారు.

## 'ఎన్టీఆర్' వాటర్ ప్లాంట్ పున:ప్రారంభం

**రొద్దం :** మండలంలోని కంబాలపల్లి పంచాయతీ బీదానపల్లి గ్రామంలో శుక్రవారం కంబాలపల్లి సర్పంచి మంజు ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్‌ను పున:ప్రారంభించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్ నిర్వహణను గాలికి వదిలేశారు. రాష్ట్రంలో కొత్తగా చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడడంతో ఈ వాటర్ ప్లాంట్లకు మరమ్మతులు చేపట్టారు. అలాగే ఇన్‌ఛార్జి ఎంపిడిఓ కేశవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మోహన్‌రాజ్, కోగిర పంచాయతీ కార్యదర్శి మనోజ్‌రెడ్డితో కలిసి కంబాలపల్లి సర్పంచ్ మంజు పున:ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచి మంజు

'ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్' రద్దుపై

# న్యాయవాదుల హర్షం

**ప్రజాశక్తి-హిందూపురం**

'ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్' రద్దుపై హిందూపురం బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఆ మేరకు శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో ఉన్న బార్ అసోసియోషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయవాదులు సిఎం చంద్రబాబు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, సీనియర్ న్యాయవాది రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ లోపభూయిష్టంగా, కబ్జాదారులకు ఊతమిచ్చేలా ఉందని, వెంటనే రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. కనీసం ప్రజల అభిప్రాయాలను తెలుసుకోకుండా మొండి వైఖరి ప్రదర్శించడం వల్లే ఎన్నికల్లో ఘోర పరాజయం పాలయ్యారన్నారు. చంద్రబాబు సిఎంగా ప్రమాణ స్వీకారం చేయగానే మాట నిలబెట్టుకుని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం హర్షణీయ మన్నారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో న్యాయవాదుల సంఘం ప్రతినిధులు శివశంకర్, శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్, రఘునాథ్‌రెడ్డి, గోపాలకృష్ణ, సిద్దు, నాగేంద్ర, రామచంద్రప్ప, మనోహర్‌రెడ్డి, వీరసేన, రమేష్, రిజ్వాన్‌ఖాన్, వన్నూరప్ప, రవిచంద్ర, మురళీ, రవికుమార్, నవీన్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురంలో హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

**మడకశిర :** వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్(భూ యాజమాన్య హక్కు చట్టం)ను నూతన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టగానే రద్దు చేస్తూ ఫైలుపై సంతకం చేయడం పట్ల మడకశిర న్యాయవాదుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు శుక్రవారం న్యాయవాదులు పట్టణంలోని బార్ అసోసియేషన్ భవనంలో సిఎం చంద్రబాబుకు ధన్యా వాదాలు తెలిపే కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షులు గోవిందరాజులు, సీనియర్ న్యాయవాదులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రజల ఆస్తులకు భద్రత లేని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తీసుకురాగా రద్దు పరచాలని అప్పట్లోనే కోరినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందన్నారు. దీంతో న్యాయవాదులు పోరాటాలకు పూనుకు న్నారన్నారు. అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు న్యాయవాదులకు మద్దతుగా నిలిచి అధికారంలోకి రాగానే భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేస్తానని హామీ ఇచ్చారని, ఆ మాటకు కట్టుబడి సిఎం హోదాలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఫైలుపై సంతకం చేశారన్నారు. దీంతో ముఖ్యమంత్రికి, వారి సహచర గణా నికి న్యాయవాదుల, ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో న్యాయ వాదులు హెచ్ఎస్. నారాయణగౌడ్, త్రిలోక్, రాధాకృష్ణ, కిష్టప్ప పాల్గొన్నారు.

మడకశిరలో హర్షం వ్యక్తం చేస్తూ అధ్యక్షునికి వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

## 'సంపత్‌కుమార్ కుటుంబానికి అండగా ఉంటాం'
### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లేఖ

**హిందూపురం :** పట్టణంలో ఇటీవల ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి సంపత్ కుమార్ దారుణ హత్యకు గురైన విషయం విదితమే. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తరపున ప్రముఖులు సంపత్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరితో పాటు రాహుల్‌గాంధీ సూచనల మేరకు ఎన్ఎస్‌యుఐ జాతీయ అద్యక్షులు, జాతీయ నాయకులు సైతం హిందూపురం వచ్చి సంపత్‌కుమార్ కుటుంబాన్ని ఓదార్చారు. తాజాగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఓ లేఖ రాశారు. అందులో 'సంపత్‌కుమార్ కుటుంబానికి అండగా ఉంటాం.. దోషులను శిక్షించే వరకూ సంపత్ కుటుంబ సభ్యులతో కలిసి పోరాటాం చేస్తాం' అని పేర్కొన్నట్లు సంపత్ కుమార్ తండ్రి రాజశేఖర్ లేఖను విలేకరులకు చూపించారు.

రాహుల్ గాంధీ రాసిన లేఖను చూపిస్తున్న సంపత్ కుమార్ తండ్రి రాజశేఖర్

## పాఠ్యపుస్తకాలు పంపిణీ

**మడకశిర :** ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆదేశాలతో శుక్రవారం మండలంలోని కల్లుమర్రి పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి నాగరాజు, ఉపాధ్యాయ బృందం, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

## చట్టాలపై అవగాహన సదస్సు

**ప్రజాశక్తి-రొద్దం**

మండలంలోని పెద్దిపల్లి గ్రామంలో శుక్రవారం స్థానిక టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో చట్టాపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో అనంత శక్తి సొసైటీ సీఈఓ లావణ్య, అధ్యక్షురాలు తహసీన్‌బి, మహాశక్తి సీఈఓ రమీజా, మహాశక్తి పాలకవర్గం, స్వశక్తి అసోసియేషన్ గౌరీ, పావని పాల్గొని మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా బాల్య వివాహాలు, గృహ హింస, తదితర అంశాలపై అనంత శక్తి సొసైటీ సిబ్బంది నాటిక రూపంలో క్లుప్తంగా వివరించారు. మహాశక్తి గురించి కిష్టమ్మ తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ న్యాయ సలహా కేంద్రం కమిటీ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో సవితమ్మ నివాసంలో సంబరాలు చేసుకుంటున్న తెలుగుతమ్ముళు

## మంత్రి సవితమ్మకు శాఖల కేటాయింపుపై హర్షం

**ప్రజాశక్తి - సోమందేపల్లి**

రాష్ట్ర మంత్రులకు శాఖల కేటాయింపులో భాగంగా పెనుకొండ ఎమ్మెల్యే, మంత్రి సవితమ్మకు సిఎం చంద్రబాబు బీసీ సంక్షేమం, ఆర్థికంగా వెనకబడిన వారి సంక్షేమం, చేనేత, టెక్స్‌టైల్స్ శాఖలు కేటాయించడం పట్ల టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. పెనుకొండ పట్టణంలోని మంత్రి సవితమ్మ నివాసంలో శుక్రవారం పార్టీ శ్రేణులు సవితమ్మకు శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ కట్ చేసి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు శివశంకర్ బాబు

## క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలి
### వైద్య ఆరోగ్య శాఖ డిడి శివశంకర్ బాబు

**ప్రజాశక్తి-హిందూపురం**

ప్రభుత్వం చేపట్టిన క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణలో శిక్షణ పొందిన వారు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి క్యాన్సర్‌పై అందరికీ అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్, రాష్ట్ర పరిశీలకులు శివశంకరబాబు సిబ్బందిని ఆదేశించారు. హిందూపురం జిల్లా అసుపత్రిలో జరుగుతున్న జిల్లా స్థాయి క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ తరగతులను శుక్రవారం ఆయన సందర్శించి రిజిస్టర్లను, శిక్షణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వైద్యాధికారులు, వెల్ నెస్ సెంటర్స్‌లో పని చేసే మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, పట్టణ ప్రాంతాల్లో పని చేసే ఎఎన్ఎంలకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇస్తున్నామని, ప్రతిఒక్కరూ క్రమశిక్షణతో శిక్షణ పొందాలన్నారు. కొత్త విషయాలు తెలుసుకుని గ్రామాల్లో ప్రజలకు క్యాన్సర్ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తద్వారా ప్రజలను క్యాన్సర్ బారి నుంచి కాపాడినవారవుతారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఆయిషా, ఎస్ఓ ఖలందర్, శిక్షకులు డా. నీరజ, డా. మాధుర్య, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం
### సక్సెస్ పాఠశాల కరస్పాండెంట్ అంజన్‌రెడ్డి

**ప్రజాశక్తి-గోరంట్ల**

విద్యార్థులకు క్రమశిక్షణ, విలువలతో కూడిన నాణ్యమైన విద్యనందించడమే సక్సెస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల లక్ష్యమని కరస్పాండెంట్ అంజన్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని గంగంపల్లి రోడ్డులో ఉన్న రామకృష్ణారెడ్డి కాంపౌండ్‌లో ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాల నిర్వహిస్తున్నామన్నారు. తమ సక్సెస్ పాఠశాల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిందని, 8 ఏళ్లుగా నర్సరీ నుంచి 7వ తరగతి వరకూ నడుపుతున్నామన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ నేర్పుతున్నామన్నారు. స్పోకెన్ ఇంగ్లీష్, హ్యాండ్ రైటింగ్‌లో పురోగతి కోసం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఏపీఆర్ఎస్ నవోదయ కోచింగ్, సాంస్కృతిక సేవా కార్యక్రమాల్లో సైతం శిక్షణ ఇస్తున్నామన్నారు. మ్యాథమెటిక్స్‌లో షార్ట్ కట్స్‌లో బోధన చేస్తున్నామన్నారు. విద్యార్థులకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత విద్యాబోధన అందిస్తున్నామన్నారు. సువిశాలమైన తరగతి గదులు, ఆహ్లాదకరమైన వాతావరణం, ఆటస్థలం సక్సెస్ పాఠశాల ప్రత్యేకత అన్నారు.

## మలేరియా నివారణపై ర్యాలీ

**ప్రజాశక్తి-గోరంట్ల**

మండలంలోని బూదిలి గ్రామంలో శుక్రవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవంపై ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి శ్వేత, మలేరియా సబ్ యూనిట్ అధికారి శివన్న మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, డెంగీ, మెదుడువాపు వ్యాధులు సోకుతాయన్నారు. కావున పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉన్న చోట దోమలు ఉత్పత్తి అవుతాయని, కావున నీరు నిల్వ ఉండకుండా చేసుకోవాలన్నారు. తలనొప్పి, చలి, జ్వరం, చెమట పట్టణం మలేరియా లక్షణాలు అన్నారు. దోమల నుంచి రక్షణ కోసం దోమతెరలు వాడాలన్నారు. ర్యాలీలో ఆరోగ్య విస్తరణ అధికారి రమణ, సిబ్బంది విజయ్‌భాస్కర్, అరుణమ్మ, ప్రశాంతి, ప్రత్యూష, శ్రావణి, ఆశా వర్కర్లు ముంతాజ్, వెంకటలక్ష్మి, గంగులమ్మ, లక్ష్మీనరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

## అడల్ట్ బిసిజిపై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రజలకు అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగేంద్ర నాయక్ సూచించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను , ఆసుపత్రి పని తీరును పరిశీలించి పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాలు, అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్‌పై అడిగి తెలుసుకున్నారు. అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ ప్రజలకు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. ఈ కార్యక్రమములో వైద్యాధికారులు డాక్టర్ జ్యోత్స్న, సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, కుమార్ రెడ్డి, సూపర్‌వైజర్ వెంకటరమణ, ఫార్మసిస్ట్ నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

## మాట నిలబెట్టుకున్న 'బాబు' : టిడిపి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

వికలాంగులకు పింఛను నెలకు రూ.6వేలు ఇస్తామని ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలబెట్టుకున్నారని టీడీపీ ఎస్సీసెల్ ధర్మవరం మండల అధ్యక్షులు రేగాటిపల్లి వరదరాజులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం స్థానిక ఎన్‌జిఒ హోంలో విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న చంద్రబాబుకు ధన్యవాదాలు చెబుతున్నామన్నారు.

## అరుణాచలానికి ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ఈ నెల 22న పౌర్ణమిసందర్భంగా ధర్మవరం ఆర్టీసీ డిపో నుండి అరుణాచల గిరిప్రదర్శనతో పాటు కాణిపాకానికి ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటుచేసినట్లు డిపోమేనేజర్ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 21న ఉదయం 6గంటలకే ప్రత్యేక బస్సు బయలు దేరుతుందన్నారు. అరుణాచలానికి రానుపోను ఛార్జీ రూ.1400 ఉంటుందన్నారు. దర్శనానికి వెళ్లేవారు బస్సు కౌంటర్లో కానీ ఆన్‌లైన్‌లో కాని సీటు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు.మరిన్ని వివరాలకు 6303151302, 9959225859 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## టీజీని కలిసిన ధర్మవరం నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

రాష్ట్ర మంత్రి టీజీ భరత్‌ను ధర్మవరం పట్టణానికి చెందిన బిజెపి నాయకులు విజయవాడలో శుక్రవారం కలిశారు. ధర్మవరానికి చెందిన అంబటిసతీశ్ కుమార్, జిల్లా నాయకులు బాలక్రిష్ణయాదవ్ టీజీ భరత్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు ఎమ్మెల్యే పల్లె సింధూర పుట్టపర్తికి రాక

**పుట్టపర్తి అర్బన్ :** స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి శనివారం పుట్టపర్తికి వస్తున్నట్లు టిడిపి కార్యాలయం సిబ్బంది తెలిపారు. ఈ మేరకు ఆ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. శనివారం ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయానికి ఎమ్మెల్యే తో పాటు ఆమె భర్త పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి వస్తారన్నారు. నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈసందర్భంగా వారు ప్రజా సమస్యలు తెలుసుకుంటారన్నారు. ప్రజా సమస్యలు అర్జీల రూపంలో సమర్పించవచ్చన్నారు.

## రక్తదానంతో ప్రాణదానం

**ధర్మవరం టౌన్ :** రక్తదానంతో ఒక ప్రాణాన్ని నిలబెట్టవచ్చని రిటైర్డ్ జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ నరసింహులు తెలిపారు. స్థానిక ఎస్‌బిఐకాలనీలోని మధు కంటి వైద్యశాలలో ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఆర్డీవో హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ నరసింహులు, హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ ఒకరు ఇచ్చే రక్త దానం మరొకరికి ప్రాణదానం అవుతుందన్నారు. మనం ఇచ్చే రక్త దానం గర్భిణులకు, బాలింతలకు, తల సేమియా బాధితులకు, ప్రమాదంలో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ప్రతి వ్యక్తికి ఎంతగానో రక్తం ఉపయోగపడుతుందని తెలిపారు.

## విద్యాశాఖ మంత్రికి ఎస్‌టియు వినతి

**పుట్టపర్తి రూరల్ :** మంత్రి నారా లోకేష్‌కు సత్యసాయి జిల్లా ఎస్‌టియు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ శుక్రవారం విజయవాడలో మంత్రి లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. గాడి తప్పిన విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలని కోరారు.

**In the court of the Prl.District Judge, Ananthapuramu**
**G.W.O.P. No: 34/2024**
**Between:**
Tanguturi Nagaveni W/o Late Tanguturi Sreenath Babu @ Tanguturi Sreenath R/at D.No:1-19-A1, L.B.Street Kadiri Town and Manda, Sri Sathya Sai Dist. **...Petitioner**

**And**

Nil **...Respondant**

**ప్రకటన**

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా పై నెంబరు కేసులో మైనరు అయిన సిద్దార్థకు రావలసిన మైనరు షేరు 4/9 వ భాగమును మరియు మైనరుకు గార్డియన్‌గా వుండుటకు పై కోర్టులో అర్జీదారురాలు అర్జీ దాఖలు చేసి యున్నారు. సదరి కేసు 18/06/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు ఎవరికైనా ఆక్షేపణలున్నచో స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై తెలపుకోవలెను.లేని యెడల పై కేసు అర్జీదారురాలు పరంగా తీర్మానింతురని తెల్పడమైనది.

**షెడ్యూలు**

Property Situated within Sri Sathya sai Dist Puttaparthi R.D Kadiri S.R.D.within Sydapuram Revenue Village, Kadiri Mandal, Kadiri Municipal Area.
**1.Govt**.Dry **S.No:**149-1, **A.C**:0.90 Cents in This **A.C**:0.40 Cents out of it
**2.Govt**.Dry **S.No:**149-2, **A.C**:1.20 Cents in This **A.C**:0.81 Cents out of it

**(By order of the court)**
**K.S.PRABHAKAR REDDY,**
**Advocate, Kadiri**
**K.BAYAPPA REDDY,**
**Advocate, Ananthapuramu. Cell:9440514220**

# వంటగ్యాస్ ఇకెవైసికి బారులుదీరిన జనం

## గడువు ఏమీ లేదంటున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

తమ వంటగ్యాస్ కనెక్షన్‌ను ఇకెవైసి చేయించుకొంటేనే ప్రభుత్వ రాయితీలు అందుతాయని ప్రచారం కావడంతో వినియోగదారులు పుట్టపర్తి గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. విపరీతమైన రద్దీతో ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సతమతమవుతున్నారు. రోజుకు 100 టోకెన్లు ఇస్తున్నారు. సర్వర్లు పనిచేయకపోవడం కూడా ఆలస్యం అవుతోంది. ప్రతి రోజూ మహిళలు వందల కొద్ది తెల్లవారుజామునే బారులు దీరుతున్నారు. మొదట గ్రామాల వారిగా నమోదు చేయాలన్న గ్యాస్ నిర్వాహకుల నిర్ణయం పనిచేయలేదు. దీంతో టోకెన్ సిస్టం అమలు చేస్తున్నారు. పలువురికి టోకెన్లు అందక నిరాశతో వెను తిరుగుతున్నారు. చంద్రబాబు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్న నేపథ్యంలో గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద రద్దీకి ఒక కారణమని తెలుస్తోంది. మరోవైపు కేంద్రం కూడా రాయితీలు ఇస్తుందన్న ప్రచారం కూడా జరుగుతోంది. ఈ సందర్భంగా ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పివి. రాజీవ్ మాట్లాడుతూ ఇకెవైసి చేయించుకోవడానికి నిర్ణీత గడువంటూ లేదని వినియోగదారులు సహకరిస్తే అందరికీ నమోదు చేయిస్తామని అన్నారు. రెండు నెలల లోపు నమోదు కార్యక్రమం పూర్తి చేస్తామన్నారు.

గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద వరుసలో నిల్చొన్న మహిళలు

పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఇఒ, తదితరులు

## పాఠ్యపుస్తకాల పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థులకు వందశాతం టెస్టుబుక్కులు, నోటు పుస్తకాలు ఇతర సామాగ్రిని పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఇఒ ప్రసాద్ తెలిపారు. రెండవ విడత మండల కేంద్రానికి చేరిన పుస్తకాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ మండలానికి చేరిన విద్యాసామగ్రిని మండలంలోని వివిధ పాఠశాలలకు పంపిణీ చేయడానికి తగు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 37 ప్రాథమిక పాఠశాలలు, ఒక ప్రాథమికోన్నత, 10 ఉన్నత పాఠశాలలు ఉన్నాయన్నారు. వీటి పరిధిలో 3985 మంది విద్యార్థులు ఈ సంవత్సరం ఒకటి నుండి పదవ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. వీరందరికీ మొదటి విడతగా ఒకటవ తరగతి నుండి ఏడవ తరగతి వరకు 11500, పాఠ్యపుస్తకాలు. 25, 764 నోటు పుస్తకాలు వచ్చాయన్నారు. అదేవిధంగా రెండవ విడతలో భాగంగా పాఠ్యపుస్తకాలు, షూలు, బెల్ట్‌లు శనివారం మండలకేంద్రానికి చేరాయన్నారు. వీటిని సత్వరమే ఆయా పాఠశాలలకు పంపిణీ చేసి వెంటనే విద్యార్థులకు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎంఇఒ చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్సీ సిబ్బంది రామ్మోహన్, నాగరాజు, రవి, శ్రీనివాసులు, సిఆర్‌ఎంటి తదితరులు పాల్గొన్నారు.

## నూతన ప్రభుత్వ ఏర్పాటులో ఉద్యోగుల పాత్ర కీలకం

### జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు విబి.భాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

నూతన ప్రభుత్వ ఏర్పాటులో ఉద్యోగుల పాత్ర కీలకమని, వారి కృషిని అభినందిస్తున్నామని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు విబి. భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు తన తొలి సంతకం మెగా డీఎస్సీపై చేయడం హర్షనీయమన్నారు. ఉద్యోగుల హక్కుల కోసం గతంలో ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశామన్నారు. అయితే గత పాలకులు ఉద్యోగుల సమస్యల పట్ల వివక్ష చూపారన్నారు. ఉద్యోగుల బకాయిలు చెల్లించలేదని, పెన్షనర్లకు ఎలాంటి సహకారం అందించలేదని విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఉద్యోగుల సమస్యల పరిష్కరిస్తారని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. అనంతరం తీర్మానాలను ఏకగ్రీవంగా సంఘం సభ్యులు ఆమోదించారు. జిల్లాలో అన్ని తాలూకా కేంద్రాలలో సమావేశాలు నిర్వహించి సంఘం బలోపేతం చేయాలని సంఘం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి తాలూకా అధ్యక్షులు లక్ష్మీనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బివి. రమణ, ఉపాధ్యక్షులు మల్లికార్జున, చంద్రకళ, చంద్రనాయక్, లక్ష్మయ్య, కాటమయ్య, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల నాయకులు

# గిరిజనులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి : ఎమ్మెల్యే


గిరిజన నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి - కదిరి టౌన్

గిరిజనులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. శుక్రవారం కదిరి పట్టణంలోని రోడ్లు భవనాల అతిథిగృహంలో ఆల్ ఇండియా బంజారా సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కందికుంటను వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం తన రాజకీయ ప్రస్థానం మొదలైనప్పుడు నుండి నేటి వరకు ఈ ప్రాంత ప్రజలతో మమేకమై ప్రయాణం సాగిస్తున్నానని అన్నారు. ఈ ప్రాంత ప్రజల స్థితిగతులు తనకు తెలుసన్నారు. గతంలో గిరిజనులు తండాలలో నాటు సారా అమ్మేవారని అపవాదు ఉండేదని ప్రస్తుతం గిరిజనులు స్థితిగతులు మారాయని ఉద్యోగాలు, ఆర్థికపరంగా స్థిరపడ్డారని అన్నారు. రాబోయే రోజుల్లో గిరిజనుల బిడ్డలు రాజకీయంగా నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. గిరిజనులకు ఏ కష్టం వచ్చినా తనను సంప్రదించవచ్చని హామీ ఇచ్చారు. తండాలను ప్రత్యేక పంచాయతీలుగా చేయాలన్నది తన లక్ష్యమని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి 500 జనాభా కలిగిన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సంఘం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేకి శుభాకాంక్షల వెల్లువ :** ఎమ్మెల్యేగా ఎన్నికైన కందికుంట వెంకటప్రసాద్‌ను పలు వర్గాలవారు సన్మానించారు. ఐసిడిఎస్ నల్లచెరువు ప్రాజెక్టు సిడిపిఒ, వ్యవసాయ శాఖ అధికారులు ఎమ్మెల్యేని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను నిర్మూలిద్దాం : ఆర్డీవో

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రెవెన్యూ డివిజన్‌ను బాల్య వివాహాల రహిత రెవెన్యూ డివిజన్‌గా మారుద్దామని ఆర్డీవో వంశీకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ డివిజనల్ స్థాయిలో బాల్య వివాహాల నిరోధక చట్టం, లైంగిక దాడుల నిరోధక చట్టాలపై మండల, గ్రామస్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సంచాలకులు లక్ష్మీ కుమారి, ఆర్డీవో వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీలత తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ గ్రామస్థాయిలో బాల్యవివాహాల మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి అధికారి బాల్య వివాహాలు, బాలల చట్టాల పైన అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు నిలుపుదల చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపిఒ మహేష్, రెవెన్యూ డివిజన్లోని తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, ఎస్‌ఐలు, ఐసిడిఎస్ అధికారులు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

## ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చేగువేరా జయంతి

**పుట్టపర్తి రూరల్ :** విప్లవకారుడు డాక్టర్ చేగువేరా 97వ జయంతిని శ్రీ సత్య సాయి జిల్లా సిపిఎం కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పవన్ కుమార్ మాట్లాడుతూ చేగువేరా పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. చెగువేరా జీవిత చరిత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సతీష్, భగవత్, హరి, ఆఫీస్ కార్యదర్శి సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకుల హర్షం

ప్రజాశక్తి - పరిగి

ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీలో భాగంగా తొలి సంతకం మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పెన్షన్ పంపిణీ, స్కిల్ డెవలప్మెంట్ అంశాలపై పెట్టడంతో స్థానిక టిడిపి నాయకులు, పెన్షనర్లు, నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా పరిగి మండల కేంద్రంలోని మడకశిర బస్టాండ్ నుండి సచివాలయం వరకు ఆయన చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చంద్రబాబు చిత్రానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మారుతి ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్ కోసం ఎదురుచూసి నిరాశ్రయులయ్యారని అన్నారు. దీనిని గుర్తించిన చంద్రబాబు నాయుడు మెగా డీఎస్సీ పై తొలి సంతకం చేస్తానని హామీ ఇచ్చారని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని అన్నారు. పెనుగొండ నియోజకవర్గంలో టిడిపికి పూర్వ వైభవం తీసుకురావడానికి సవితమ్మ చేసిన కృషిని గుర్తించిన అధిష్టానం మంత్రివర్గంలో స్థానం కల్పించడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డిఎస్‌ఎల్ శ్రీనివాసులు, నరసింహులు, హనుమయ్య, లక్ష్మణరావు, ప్రవీణ్ రెడ్డి, వడ్డెర శ్రీనివాసులు, జనసేన అశ్వర్థ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల సంబరాలు

కేక్ కట్ చేస్తున్న ధర్మవరం బార్ అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుచేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంతకం చేయడం హర్షనీయమని ధర్మవరం బార్‌అసోషియేషన్ అధ్యక్షులు సుబ్బారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం బార్ అసోషియేషన్ చాంబర్‌లో ఆయన న్యాయవాదులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా చేసే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును తీసుకురావాలని విశ్వప్రయత్నాలు చేసిందని విమర్శించారు. దీనిని అన్ని వర్గాల ప్రజలు, న్యాయవాదులు వ్యతిరేకించామన్నారు. అయితే చంద్రబాబునాయుడు తాము అధికారంలోకి వస్తే ఈ చట్టాన్ని రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబునాయుడు ఈ చట్టాన్ని రద్దు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు క్రిష్ణమోహన్, దుర్గాప్రసాద్, రహంతుల్లా, చౌదరి, బిల్లేరవి, గోపీక్రిష్ణ, గుంటప్ప, అబ్దుల్లా, నల్లప్ప, రామానాయుడు, భాస్కర్, మోహన్, నరేంద్ర పాల్గొన్నారు.

**కదిరి అర్బన్ :** ల్యాండ్ టైటిలింగ్‌యాక్ట్ జీవోను రద్దు చేయడంపై సీనియర్ న్యాయవాది కృష్ణమూర్తి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బడుగు బలహీన వర్గాలకు సంబంధించిన భూములను దౌర్జన్యపరులకు అంటగట్టేందుకు వైసిపి ప్రభుత్వం టైటిల్ యాక్టును తెచ్చిందని విమర్శించారు. ఈ యాక్టుఉ రద్దు చేయాలని న్యాయవాదులు ఆరు మాసాలు నిరసనతో అప్పటి సిఎం జగన్‌కు విజ్ఞప్తి చేసినా స్పందించలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నరసింహులు రవీంద్ర, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమలో కార్మికుడు మృతి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూమకుంట పారిశ్రామిక వాడలోని రోల్ వెల్ పరిశ్రమలో శుక్రవారం తెల్లవారు జామున కాంట్రాక్టు కార్మికుడు లక్ష్మీనారాయణ(45) మృతిచెందాడు. తోటి కార్మికులు తెలిపిన వివరాల మేరకు లక్ష్మీనారాయణ గురువారం రాత్రి విధులకు హాజరయ్యాడు. విధులు నిర్వహిస్తున్న సమయంలో లక్ష్మీనారాయణ బాత్ రూమ్ కు పోయి వస్తానని చెప్పి వెళ్లాడు. అయితే చాలసేపు అయినప్పటికి రాకపోవటంతో తోటి కార్మికులు వెళ్లి చూశారు. క్యాంటీన్ ముందు స్పృహ తప్పి పడి ఉన్నాడు. నోటి నుంచి నురగ వస్తోంది. దీంతో వెంటనే అసుపత్రికి తీసుకెళ్లడానికి ప్రయత్నించారు. అయితే అప్పటికే లక్ష్మీనారాయణ మృతిచెందాడు. దీంతో కార్మికులు విషయాన్ని పరిశ్రమ యాజమాన్యానికి సమాచారమిచ్చారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. లక్ష్మీనారాయణ మృతి ఎలా జరిగిందన్నది పోలీసుల విచారణలో తెలియాల్సుంది. మృతుడికి భార్య గంగమ్మ, కొడుకు భానుప్రసాద్, కూతురు సౌమ్య ఉన్నారు.

## 'దాడిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు'

### బాధిత మహిళ ఆవేదన

ప్రజాశక్తి-రొద్దం

ఈ నెల 4వ తేదీ ఓ వ్యక్తి తనను అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు దాడికి పాల్పడ్డాడని, అతడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం చేయలేదని శుక్రవారం మండలం లోని మోబర్లపల్లి గ్రామానికి చెందిన బాధిత దళిత మహిళ సరస్వతి విలేకరుల ఎదుట వాపోయింది. ఆమె తెలిపిన వివరాలు.. సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి ఓటు వేశావంటూ గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త ఆదిమూర్తి ఈ నెల 4వ తేదీ రాత్రి తనను కులం పేరుతో దూషించడంతో పాటు అసభ్యంగా ప్రవర్తిస్తూ దాడి చేశాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఆయన భార్య శివమ్మ, కుమార్తె నందిని, కుమారుడు బాలు కూడా తనపై దాడి చేశారని తెలిపింది. పథకం ప్రకారం ముందుగానే ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులు తొలగించి చీకటిలో దాడి చేశారని వాపోయింది. ఆ తర్వాత రోజు కూడా అతని తల్లి హనుమక్క, చెల్లెలు శకుంతల తన ఇంటి వద్దకు వచ్చి కులం పేరుతో దూషించారని పేర్కొంది. ఆదిమూర్తి నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఈ నెల 5వ తేదీ (బుధవారం) పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపింది. అయినా పోలీసులు అతడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దీంతో శుక్రవారం మరోమారు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపింది.

## మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

**తలుపుల :** పాము కాటుతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి మాజీ ఎంపిపి ఆవుల మనోహర్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని గంజివారిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన గంగాద్రి అనే వ్యక్తి పాముకాటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆవుల మనోహర్ రెడ్డి మృతుని కుటుంబ సభ్యులకు రూ. 5 వేలు ఆర్థికసాయం అందజేశారు.

## ప్రశాంత వాతావరణంలో 'బక్రీద్' జరుపుకోండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలో ప్రశాంతవాతావరణంలో బక్రీదు పండుగను జరుపుకునేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలువురు ఉన్నతాధికారులు ముస్లిం మత పెద్దలతో, ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కదిరి, పెనుగొండ, హిందూపురం, సబ్ డివిజన్లలో డీఎస్పీలు శ్రీలత, బాజీ జాన్ సైదా , కన్జక్షన్ ముస్లిం మత పెద్దలతో సమావేశాలు నిర్వహించి వారితో మాట్లాడారు. అదేవిధంగా అన్ని సర్కిల్ పరిధిలో సిఐలు, ఎస్‌ఐలు ముస్లిం మత పెద్దలతో సమావేశాలు నిర్వహించారు. ఏవైనా ఇబ్బందులుంటే తెలుసుకుని పరిష్కరించాలనే ఉద్ధేశ్యంతోనే ఈ సమావేశం నిర్వహించి వారితో అభిప్రాయాలను తెలుసుకున్నారు. జూన్ 17వ తేదీ బక్రీద్ పండుగను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే పోలీస్ అధికారులకు తెలియజేయాలన్నారు. మత సామరస్యానికి ప్రతిగా అందరూ ఈ బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీసు అధికారులు కోరారు.

## మెగా డీఎస్సీపై మాట నిలబెట్టుకున్న చంద్రబాబు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఎన్నికల సమయంలో డీఎస్సీపై చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారనితెలుగు యువత రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ సిఎం తొలి సంతకం వల్ల 16,347 ఉద్యోగాల భర్తీకి అవకాశం ఏర్పడిందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పెన్షన్ల పెంపు, అన్నా క్యాంటీన్ పునరుద్ధీకరణ, స్కిల్‌గణనపై సంతకాలు చేసిన ముఖ్యమంత్రికి తెలుగు యువత తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అంతేకాక సత్యసాయి జిల్లాలో బీసీలకు ఇద్దరికి మంత్రి పదవులు కేటాయించడం కూడా సంతోషంగా ఉందన్నారు. టిడిపి ముందునుంచి బీసీలకు తగిన ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

## పంటసాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - నల్లచెరువు

ఆదర్శ రైతు సంఘాల ఆధ్వర్యంలో వాసన్ సంస్థ నిర్వహణలో పంటసాగుపై రైతులకు అవగాహనాసదస్సును శుక్రవారం నిర్వహించారు. జీవనోపాధి మెరుగుకు అవసరమగు యంత్రాలు, వ్యవసాయ పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంస్థల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఆర్టీసీ డ్రైవర్లు వర్షాకాలంలో తగిన జాగ్రత్తలు పాటించి ప్రమాదరహిత జిల్లాగా పేరు తేవాలని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి మధుసూదన్ కోరారు. వర్షాకాలంలో జరిగే ప్రమాదాలపై డ్రైవర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో రహదారులలో నీరు నిలిచి గుంతలు కనపడని పరిస్థితి ఉంటుందన్నారు. అలాగే బంకమట్టి ఉంటే బస్సు జారి ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందన్నారు. డ్రైవర్లు విధులలో ఉన్నప్పుడు ఇతర ఆలోచనలు పెట్టుకోకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించవలసిన నియమ నిబంధనలపై రూపొందించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా రవాణా సిబ్బంది, మెకానికల్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల ర్యాలీ

**చిలమత్తూరు :** మండల పరిధిలోని చిలమత్తూరు, దేమకేతేపల్లి, కొడికొండ సెక్టార్లలో సిడిపిఒ రెడ్డిరమణమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ మేరకు అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు ప్రీ స్కూల్ సమావేశం నిర్వహించి విద్యాప్రాముఖ్యత గురించి వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో కొడికొండ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలీముల్లా, కొడికొండ, చిలమత్తూరు, దేమకేతేపల్లి సెక్టార్ పరిధిలోని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

## అంకితభావంతో సేవ చేస్తా : మంత్రి

ప్రజాశక్తి - ధర్మవరంటౌన్

తనకు దక్కిన వైద్య ఆరోగ్య శాఖ కుటుంబసంక్షేమం, వైద్యవిద్యశాఖలకు అంకితభావంతో సేవ చేస్తానని ఆశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ట్వీట్ చేశారు. చంద్రబాబు మంత్రివర్గంలో తనకు కీలక శాఖ దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన బీజేపీ పెద్దలు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. తనకు దక్కిన శాఖపై పూర్తిగా పట్టుసాధించి ఆశాఖ రూపురేఖలను మార్చడానికి ప్రయత్నిస్తానని అన్నారు.

## జగన్‌ను కలిసిన 'బత్తల'

ప్రజాశక్తి - కదిరి టౌన్

వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డిని డాక్టర్ బత్తల హరిప్రసాద్ శుక్రవారం కలిశారు. ఈ మేరకు ఆయనతో పాటు వైసిపి రాష్ట్ర బిసి విభాగం ఉపాధ్యక్షులు డాక్టర్ బత్తల వెంకటరమణ, బోయ శాంతమ్మ తదితరులు తాడేపల్లి కార్యాలయంలో జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో బత్తల, తదితరులు